# ఆదివాసులపై ఇంకెన్నాళ్లీ 'అభివృద్ధి' అత్యాచారాలు?

మనం 'అభివృద్ధి' కావాలి. మన ఆధునిక జీవనశైలికి అవసరమైన హంగులెన్నో సమకూరాలి. దానికోసం అడవి కావాలి, అడవిలోని ఖనిజాలు తోడాలి. అక్కడ పుట్టే ఏటినీరు నదుల్లై ప్రాజెక్టుల్లై నగరాలు రావాలి. ఆ నీటినుండో, బొగ్గునుండో విద్యుత్తు లాగాలి. అన్నిటినీ అమ్ముకొని రెండంకెల వృద్ధిరేటు పొందాలి. ఆ రేటు వేగంతో మన జీవితాలు పైపైకి ఎదగాలి. అందుకు ఆదివాసులు త్యాగాలు చేయాలి. వారి త్యాగాల పరంపర సాగుతూనే ఉండాలి. అదే మన పాలకుల దృష్టిలో వృద్ధి, అభివృద్ధి.

ఆదివాసులే ఎందుకు ఎప్పుడూ త్యాగాలు చేయాలన్న ప్రశ్న అభివృద్ధి ఫలాలను ఆస్వాదిస్తున్న మిగతా సమాజానికి రాదు. పైగా ఇంకా ఇంకా అభివృద్ధిని కాంక్షిస్తారు. పోలవరం ప్రాజెక్టు, బాక్సైట్ గనుల తవ్వకం ఈ అభివృద్ధి కోవకు చెందినవే. కేవలం వారి లాభాలను మాత్రమే బేరీజు వేసుకుంటున్నారు తప్ప ప్రజలకు జరిగే నష్టాన్ని ఎవరూ లెక్కించట్లేదు, లెక్క చేయడం లేదు. వాటివల్ల ఎంత విధ్వంసం ఆదివాసీ సమాజంలో జరగనుందో పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎంత ముంపు, ఎంత ముప్పు, ఎంత ప్రకృతి విధ్వంసం – ఈ లెక్కలు తేలేదెలా?

## పోలవరం

మన రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లోనూ రావాలని కోరుకునేవారు దానివల్ల ఆదివాసీ సమాజానికి జరిగే నష్టం గురించి ఏ మాత్రం ఆలోచిస్తున్నారు? ఆ ప్రాజెక్టు మూడు జిల్లాల (ఖమ్మం. తూ.గో, ప.గో) షెడ్యూల్డ్ ప్రాంతాల్లో విపరీతమైన విధ్వంసాన్ని సృష్టించనుంది. మొత్తం తొమ్మిది మండలాల్లో దాదాపు లక్షా తొంభైవేల జనాభా, ప్రధానంగా ఆదివాసులు నిర్వాసితులవుతారు. ఈ ప్రాజెక్టు వారి జీవనాన్నే కాక జీవన విధానాన్నే పూర్తిగా ఛిద్రం చేస్తుంది. ఏజెన్సీ అంచునో, మైదాన ప్రాంతాల్లోనో పునరావాస కాలనీలు కట్టించి, తలా ఎకరం డిఫారం భూమిచ్చి, నష్టపరిహారంగా ఇంతో అంతో నగదు వారి చేతిలో పెట్టినా వారు కోల్పోతున్న దానికి సరితూగదు. అడవి తీర్చే అనేక రకాల అవసరాలను వాళ్లు శాశ్వతంగా కోల్పోతారు. అడవే ఆధారంగా, ఆవాసంగా గల ఆదివాసీ జీవన సంస్కృతి ప్రాజెక్టు కింద సమాధి అయిపోతుంది. ఆదివాసేతర సమాజాన్ని ఎదుర్కోవడానికి ఈ జీవన సంస్కృతే ఆదివాసులకు బలాన్ని ఇచ్చింది. ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. పునరావాస కాలనీలకు బదిలీ అయ్యాక ఆదివాసులు తమ స్వతంత్ర వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. ఆదివాసీయేతర సమాజాన్ని ఎదుర్కొనే మానసిక శక్తిని కోల్పోతారు. ఈ ప్రాజెక్టు వస్తే ఆదివాసుల జీవనానికీ, జీవితానికీ జరగగల హాని ఊహకు సైతం అందడం కష్టం.

అందుకే అభివృద్ధి పేరిట ఇటువంటి విధ్వంసకర ప్రాజెక్టులు వద్దనడం అవసరం. ప్రజలను విధ్వంసానికి గురిజేసి, వాళ్ళను భిక్షగాళ్ళను చేసి పెద్దవాళ్ళకూ, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలకూ, కార్పొరేట్ సంస్థలకూ వనరులను అప్పజెప్పే విధానాన్ని ప్రశ్నించడం, వ్యతిరేకించడం అవసరం. ప్రజలందరి, మరీ ముఖ్యంగా పేద బలహీనుల జీవితాలను మెరుగుపరిచేలా ఆర్థిక వ్యవస్థను బాగుచేస్తే అభివృద్ధి అవుతుందే తప్ప ఆదివాసుల పొట్టకొట్టి, వాళ్ళను ముంచి – ఒకసారి గాదు, రెండు మూడుసార్లు విస్థాపనకు గురిజేసి – ప్రకృతిని నాశనం చేసేది అభివృద్ధి అనిపించుకోదు, దోపిడీ అనిపించుకుంటుందని నినదిద్దాం.

## బాక్సైట్

బాక్సైట్ తవ్వకాలు చేపట్టవద్దని ఆదివాసీ ప్రజానీకం, ముఖ్యంగా విశాఖ ఏజన్సీలో ఏకగ్రీవంగా, పార్టీలతో ప్రమేయం లేకుండా, తేడాల్లేకుండా వ్యతిరేకిస్తున్నారు. అయినా ప్రభుత్వం బలవంతంగా ఖనిజాన్ని తీసుకుపోయి ప్రైవేటు కంపెనీలకు అప్పజెపుతాం అనడం 'పెసా' చట్టాన్ని అపహాస్యం చేయడమే. 'పెసా' చట్టం రాజ్యాంగంలోని తొమ్మిదవ అధ్యాయాన్ని ఆదివాసీ ప్రాంతాలకు విస్తరింపజేసే అంశం. ఆదివాసీ ప్రాంతాలలో స్వయంపరిపాలన దాంట్లో ప్రధానమైన విషయం. స్వయం పరిపాలనా హక్కు రాజ్యాంగం ఇచ్చిన తరువాత కూడా జెర్రెల, గాలికొండ, రక్తకొండ, సప్పర్ల తదితర ప్రాంతాలలో మైనింగ్ చేపట్టవద్దు. మా వనరులు, మా నీళ్ళు, మా కొండలు, మా అడవి నాశనం అవుతాయని ఆదివాసులు ముక్తకంఠంతో అంటున్నా కూడా తవ్వి తీస్తామనడం 'పెసా' చట్టాన్నేకాదు, అయిదవ షెడ్యూల్‌నే కాదు, భారత రాజ్యాంగాన్నే వెక్కిరించడం అవుతుంది. తవ్వకాలు చేపట్టడానికి ప్రభుత్వ సంస్థ అయిన ఎ.పి. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను బడా కంపెనీల బినామి సంస్థగా ప్రభుత్వం తయారుచేసింది. పోనీ బాక్సైట్‌నుండి తయారయ్యే అల్యూమినియం ఏమైనా అంత అవసరమా అంటే మన దేశం ఈ విషయంలో ఇప్పటికే స్వయం సమృద్ధిగా ఉంది. కేవలం ఎగుమతి కోసం, జిందాల్, రస్–అల్‌ఖైమా వంటి కార్పొరేట్ సంస్థల జేబులు నింపడానికి తప్ప బాక్సైట్ తవ్వి తీయాల్సిన అవసరం ఇప్పుడేమీ లేదు. ప్రభుత్వం పూనుకుంటున్న ఈ ప్రక్రియ మౌలికంగానే ఆదివాసీ హక్కులకు భంగకరం. నీటి వనరుల నష్టం చాలా ఉంటుంది. బాక్సైట్ ఖనిజం కొండల ఎగువభాగాన ఉండటం వల్ల ఆ కొండల నుండి వాగులు, వంకలు, గెడ్డల ద్వారా నదులలోకి వచ్చే నీరంతా ఆగిపోతుంది.

సమాజానికీ, దేశానికీ అవసరం లేని ఇటువంటి ప్రాజెక్టులను అసలు ఎందుకు అనుమతించాలి? కేవలం పెట్టుబడులొస్తాయి, దానివల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభాలొస్తాయి, దానివల్ల ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వస్తుంది. చూపించుకోవడానికి ఒక వృద్ధి రేటు ఉంటుంది అని తప్ప నిజంగా ఇది

సమాజానికి అవసరమా? ప్రయోజనకరమా? స్థానిక ప్రజలకేమైనా ఉపాధి దొరుకుతుందా? ఈ ప్రశ్నలతో నిమిత్తం లేకుండా వీటిని చేపట్టాలని చూస్తున్నారు.

ఒకవైపు ఇలాంటి భారీ విధ్వంసాలు మరోవైపు అంతకంటే భారీ నిర్లక్ష్యాలు. ఆదివాసుల మౌలిక అవసరాలను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకుంటోందో చూడండి.

## ఆరోగ్యం

ఏజెన్సీ ప్రాంతాలలో జ్వరాలవల్ల – ప్రత్యేకించి సెరిబ్రల్ మలేరియా వల్ల ప్రతీ ఏడాది ఎందరో ఆదివాసులు చనిపోతున్నారు. ఎండాకాలంలో మొదలై సెప్టెంబర్‌లోగా వందల సంఖ్యలో క్రమం తప్పకుండా చనిపోతున్నారు. నాలుగైదేళ్ళకొకసారి మలేరియా ఉపద్రవం రూపంలో దాపురించినపుడు వేల సంఖ్యలో కూడా చనిపోతున్నారు. ఈ చావులకు ప్రభుత్వ వైఫల్యమే కారణం, వికృతమైన పాలనా విధానమే కారణం. పరిసరాల పారిశుద్ధ్యాన్ని సక్రమంగా నిర్వహించకపోవడం, రోగాలను తట్టుకోవడానికి కావాల్సినటువంటి పౌష్టికాహారం ఆదివాసులకు అందుబాటులో లేకపోవడం మరో ముఖ్యమైన కారణం. అస్తవ్యస్థ వైద్యవ్యవస్థ, వైద్య సిబ్బంది కొరత ఇంకో ప్రాథమికమైన లోపం. ఆదివాసులకు వచ్చే రోగాలు చికిత్స చేయలేని, నివారణ సాధ్యంకాని రోగాలు కావు. వాటిని ఎదుర్కోవటానికి ఏ రకమైనటువంటి కొత్త ప్రయోగాలు గాని, సాంకేతిక ప్రక్రియగాని అక్కరలేదు. ఎప్పటినుంచో తెలిసినటువంటి మందులు, చికిత్సలే చాలు. అయినా ప్రభుత్వం చేస్తున్నది ఏమిటి? ఎంతసేపూ పి.హెచ్.సి.లు పెట్టాం, సబ్‌సెంటర్లు పెట్టాం, కమ్యూనిటీ ఆసుపత్రులు పెట్టామనే ప్రచార ఆర్భాటమే తప్ప, వైద్యులే రోగుల దగ్గరకు వెళ్ళి వారికి పరీక్షలు చేసి మందులిచ్చి నయంచేసే ఆరోగ్య వ్యవస్థ ఏజెన్సీ ప్రాంతాల్లో ఎందుకు ఉండదు? సంచార వైద్య వ్యవస్థ అవసరం గురించి కె.ఆర్. వేణుగోపాల్‌గారి ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన కమీషన్ సైతం చెప్పింది. ఆదివాసీ సంఘాలు, హక్కుల సంఘాలు గత 15 ఏళ్ళ నుంచి చెబుతూనే వున్నాయి. నిర్దిష్టమైన ఫిర్యాదులు ప్రభుత్వానికి అందజేస్తూనే వున్నాయి. కాని అవన్నీ బుట్టదాఖలే అయ్యాయి. కనీసం పిల్లలకు ఒకపూట అన్నం పెట్టే అంగన్‌వాడీ కేంద్రాలు సగం ఏజెన్సీ గూడాలలో కూడా లేవు. ఈ రోగాలకు సంబంధించి కారణాలు స్పష్టమే, అయినా పరిస్థితి మెరుగుపడలేదంటే ఏమనుకోవాలి? ఆదివాసీ ప్రాణాలంటే లెక్కలేకపోవడమే కదా!

## తాగునీరు

అన్ని గ్రామాలకు తాగునీటిని ఒక హక్కుగా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. అయినా ఆదిలాబాద్‌లో ఉట్నూరు నుండి శ్రీకాకుళంలో సీతంపేట దాకా ఆదివాసీ ప్రాంతాలలో రక్షిత మంచినీటి వ్యవస్థ అరవైశాతంపైబడి గ్రామాలకు లేనేలేదు. ప్రభుత్వాల తీవ్రమైన నిర్లక్ష్యం కాదా ఇది? కేవలం కలుషితమైన నీరు తాగడం వల్లనే ఆదివాసులు పదేపదే రోగాల బారిన పడుతున్నారు, చనిపోతున్నారు. అతిసారలాంటి నివారించతగ్గ వ్యాధుల వల్ల కూడా మనుషులు చనిపోతున్నారంటే సిగ్గుతో తలదించుకోవాలి. ఎందుకంటే శుభ్రమైన మంచినీళ్ళు అందుబాటులో వుంటే అతిసార రాదు. అంతకంటే దానికి వేరే ఏమీ అక్కర్లేదు. 1998లో ఆదిలాబాద్ జిల్లాలో 3000కు పైగా, అధికభాగం ఆదివాసులే అతిసారతో చనిపోయారు. ఇప్పటికీ కలుషితమైన నీరు తప్ప వేరే దిక్కులేక బతుకుతున్నారు. అరవై సంవత్సరాల సంక్షేమ పాలన వైఫల్యం ఒకపక్క వుండగా మినరల్ వాటర్‌ను తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులో వుంచుతామని ప్రభుత్వం ప్రకటించడం ప్రజలను అపహాస్యం చేయడం కాదా? మంచినీళ్లు ఒక ప్రాథమిక అవసరం. దాన్ని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ నీటిని ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పేబదులు ప్రజలకు సరఫరా చేయడానికి ఏం కష్టం వచ్చింది?

అడుగుతూ పోతే ఆదివాసుల హక్కుల గురించి ఇంకా చాలా ప్రశ్నలే వున్నాయి. 1 ఆఫ్ 70 చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం, ఇరవయ్యేళ్లుగా సక్రమ అమలుకు నోచుకోని ఎస్‌సి ఎస్‌టి చట్టం, సంక్షేమ హాస్టళ్లు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాలు, విద్యావ్యవస్థ – వీటన్నిటి గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించవలసినవి అనేకం వున్నాయి. ఆదివాసుల బ్రతుకులతో ఆడుకోవడం మానుకోవాలని మరోమారు డిమాండ్ చేద్దాం. వారిపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిద్దాం. వాళ్ళు ఇతరుల అభివృద్ధి కోసం 'త్యాగాలు' ఎందుకు చేస్తూనే వుండాలో ప్రశ్నిద్దాం.

**మానవహక్కుల వేదిక**

01-07-2010 **Human Righs Forum (HRF)**

## పాదయాత్ర

**జూలై 10 ఉదయం 9 గంటలకు పోలవరంలో మొదలై ఇటికెలకోట, బోడిగూడెం, వింజరం, వెంకటరెడ్డిగూడెం, గార్లగొయ్యి, గుంజవరం, దొండపూడి, ఎల్.ఎస్.డి. పేట, రెడ్డిగూడెం, కొవ్వాడ, రాజానగరం, కోట రామచంద్రపురం వరకు .**

**జూలై 11న కె.ఆర్.పురంలో మొదలై కన్నాపురం, కండ్రికగూడెం, నూతిరామన్నపాలెం, బొత్తప్పగూడెం, నందాపురం, రేగులకుంట, కంసాలకుంట మీదుగా బుట్టాయిగూడెంలో ముగుస్తుంది.**

ప్రచురణకర్తలు: ఎస్. జీవన్‌కుమార్, అధ్యక్షులు: **9848986286,** వి.ఎస్. కృష్ణ, ప్రధాన కార్యదర్శి: **9440411899**